ట్రాఫిక్ సమస్య తీరేదెన్నడో?

- ఆర్మూర్ పట్టణంలో రోడ్లపైనే వాహనాల పార్కింగ్
- ఇబ్బందుల్లో పట్టణ ప్రజలు


మంథని బ్లాక్‌రోడ్డుపై ట్రాఫిక్ జామ్ (ఫైల్)


నిజాంసాగర్ కెనాల్ రోడ్డుపై నిలిపిన వాహనాలు (ఫైల్)

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వాహనాల రాకపోకలు సైతం విపరీతంగా పెరిగాయి. ఈక్రమంలో పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పలువురు వాహనదారులు తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేయడంతో తోటి వాహనదారులు సైతం నానా అవస్థలు పడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

పట్టణంలోని ప్రధాన రహదారులకు ఇరువైపుల రోడ్డు ఆక్రమణలతో ఇరుకుగా మారుతుంది. ప్రధానంగా పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్, దొండి మెడికల్ చౌరస్తాతోపాటు పెర్కిట్, మామిడిపల్లి ఇతర అంతర్గత రోడ్లను ఆక్రమించి పలువురు వ్యాపారాలు సాగిస్తున్నారు. పట్టించుకునేవారు లేకపోవడంతో వ్యాపారులు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారు. వాహనాల కోసం వేసిన రోడ్డు ఆక్రమణలకు గురికావడంతో తాము ప్రయాణం ఏవిధంగా చేయాలని వాహనదారులు వాపోతున్నారు. కొన్నిచోట్ల రోడ్డుపక్కన ఉన్న దుకాణాలకు వచ్చిన వినియోగదారులు తమ వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఇతర వాహనదారులు రాకపోకలు సాగించడానికి అవకాశం లేకుండా పోతుంది. పట్టణంలోని ప్రధాన అంతర్గత రోడ్లు తహసీల్దార్ కార్యాలయం నుంచి భారత్ గ్యాస్‌కు వెళ్లే రోడ్డు, అలాగే ఇరిగేషన్ కార్యాలయం నుంచి కూరగాయల మార్కెట్‌కి వెళ్లే రహదారి అసలే ఇరుకుగా ఉంటుంది. ఈక్రమంలో రోడ్డుపై వాహనాలు నిలపడంతో ట్రాఫిక్ జామ్ సమస్యలు చోటుచేసుకుంటున్నాయి. నిజాంసాగర్ కెనాల్ సమీపంలో మాంసం విక్రయ దుకణాలు అధిక సంఖ్యాలో ఉండటంతో ప్రజలు రోడ్లపై వాహనాలు నిలిపి, కొనుగోలు చేస్తున్నారు. దీంతో పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలోని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

'గ్రాండ్ హెల్త్ చాలెంజ్' ప్రారంభం



బోధన్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో సోమవారం ఆర్టీసీ ఉద్యోగుల జీవిత బాగస్వాముల ఆరోగ్య రక్షణ కోసం 'గ్రాండ్ హెల్త్ చాలెంజ్' వైద్య శిబిరాన్ని డీఎం శ్రీనివాస్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఉద్యోగుల కుటుంబీకులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. నవంబర్ 2వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని డీఎం తెలిపారు. డిపో ఏఈ (ఎం) శ్రావణ్, సూపరింటిండెంట్ (టీ) లక్ష్మణ్, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



రెంజల్(బోధన్): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలతో పాటు గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్ జాదవ్ సూచించారు. మండలంలోని కిసాన్‌తండా గ్రామ శివారులో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని పలు సూచనలు, సలహాలను సిబ్బందికి తెలిపారు. అనంతరం గత నెలలో రిటైర్మెంట్ అయిన ఆయమ్మను సన్మానించారు. సూపర్‌వైజర్ ప్రమీలారాణి అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

నవీపేట: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) వాజిద్ హుస్సేన్ సోమవారం తనిఖీ చేశారు. రైతులకు విక్రయించే ప్రతి ఎరువు, యూరియా మందుల వివరాలను రిజిస్టర్‌లో పొందుపర్చాలని దుకాణ నిర్వాహకులకు సూచించారు. ఈపీఓఎస్ మిషన్‌తో విక్రయాలను జరపాలని ఆదేశించారు. ఎరువుల మందులు కొనుగలు చేసిన రైతుకు తప్పని సరిగా రశీదు ఇవ్వాలని ఆదేశించారు. ఏవో నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. దీపావళి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. అనంతరం అగ్నిమాపక, పోలీసుల శాఖల అధికారులు టపాసుల దుకాణాలను తనిఖీ చేశారు. టపాసుల దుకాణాల వద్ద తీసుకున్న జాగ్రత్తలను పరిశీలించారు. అగ్నిమాపకశాఖ అధికారులు గంగదాస్, సీఐ వెంకట నారాయణ, సిబ్బంది ఉన్నారు.

రాష్ట్ర కమిటీలో చోటు

బోధన్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఇటీవల వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాల్గవ రాష్ట్ర మహాసభ నిర్వహించి, రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీలో బోధన్‌కు చెందిన ముగ్గురు నాయకులకు చోటు దక్కింది. పట్టణంలోని జిల్లా ప్రధాన కార్యదర్శి యేశాల గంగాధర్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అలాగే మోస్రాకు చెందిన కవితా రెడ్డి, పెంటాకుర్దు గ్రామానికి చెందిన గైని రాములు రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా వారు సోమవారం మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమ కోసం కృషి చేస్తామన్నారు.

చేనేత వృత్తిపై శిక్షణ



రుద్రూర్: చేనేత వృత్తిపై ఆసక్తి ఉన్న మహిళలకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సిద్దిపేట ఏడీ కార్యాలయ అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బోధన్ చేనేత సహకార సంఘం పరిధిలోని రుద్రూర్ మండల కేంద్రంలోని బ్రాంచి కార్యాలయాన్ని సోమవారం జేటీవో సతీశ్‌తో కలిసి సందర్శించారు. సంఘంలో ఉత్పత్తి చేస్తున్న బెడ్‌షీట్‌లను పరిశీలించారు. సంఘ కార్యాకలాపాల గూర్చి తెలుసుకున్నారు. సంఘ ఉత్పత్తులను టెక్కో ద్వారా కొనుగోలుకు ప్రతిపాదనలు చేశారు. నేత వృత్తి నేర్చుకోవడానికి ముందుకు వస్తు వీవర్స్ సర్వీస్ సెంటర్ ద్వారా 45 రోజుల పాటు ట్రైనింగ్ ఇస్తామన్నారు. చేనేత కార్మికుల కోసం ప్రభుత్వ అందిస్తున్న పథకాల గూర్చి వివరించారు. ఏడీవోతో పాటు చేనేత సంఘం అధ్యక్షుడు మోత్కురి నారాయణ, మాజీ డైరెక్టర్ జువ్వల పోతన్న, సంఘం మేనేజర్ ఈర్వ నాగరాజు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి


పిప్రిలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు పలు మండల కేంద్రాల్లో స్థానిక అధికారులకు వారు వినతిపత్రాలు అందజేశారు. ఆర్మూర్ మండలం పిప్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాల సందర్శనకు వచ్చిన ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డికి సంఘ నాయకులు వినతి పత్రం అందజేశారు. అలాగే మాక్లూర్, ఆర్మూర్, కమ్మర్‌పల్లి మండల కేంద్రాల్లో స్థానిక తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను, డీఏ, పీఆర్సీలను అందించాలని కోరారు. ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.


మాక్లూర్‌లో తహసీల్దార్ శేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో..

మెనూ ప్రకారం భోజనం అందించాలి



బాల్కొండ: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు. మెండోరా మండలం బుస్సాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు చదవడం, రాయడం తప్పకుండ నేర్పించాలన్నారు. అనంతరం ఎంఈవోను ఉపాధ్యాయులు సన్మానించారు.

బాల్కొండ ఖిల్లా పరిశీలన



బాల్కొండ: మండల కేంద్రంలోని ఖిల్లా ప్రాంతాన్ని సోమవారం ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి సందర్శించారు. ఖిల్లాను అభివృద్ధి చేయాలని పలు మార్లు ఖిల్లా పరిరక్షణ సమితి సభ్యులు కలెక్టర్‌కు గతంలో విన్నవించారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎంపీడీవో ఖిల్లాను సందర్శించారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలతో ఖిల్లా పరిసరాలను శుభ్రం చేయించాలని నిర్ణయించారు. అలాగే నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఏపీవో ఇందిరా, ఖిల్లా పరిరక్షణ సమితి సభ్యులు తదితరులు ఉన్నారు.

సంక్షిప్తం

డొంకేశ్వర్ తహసీల్దార్‌గా నరేశ్



డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ తహసీల్దార్‌గా నరేశ్ నియామకం అయ్యారు. ఈమేరకు కార్యాలయంలో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఇదివరకు తహసీల్దార్‌గా పని చేసిన హైమద్ హుస్సేన్ కలెక్టరేట్‌కు బదిలీ కావడంతో ఆయనకు వీడ్కోలు పలికారు.

ఉచిత శిక్షణ ప్రారంభం

నందిపేట్ (ఆర్మూర్): నందిపేట్, తల్వేద జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసే విద్యార్థులకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. లక్కంపల్లి సాగర్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ శిక్షణ కార్యక్రమాన్ని విద్యార్థులు వినియోగించు కోవాలని ఉపాధ్యాయులు కోరారు. హెచ్ఎంలు మంజుల, మోహన్, టీచర్లు సాయన్న, గంగాధర్, గోపాల్, మమత ఉన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం

రెంజల్(బోధన్): రెంజల్‌లోని బాలికల హాస్టల్‌లో సోమవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రెంజల్ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం భూమయ్యప్ప కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. హాస్టల్స్‌లో ఉండే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల వసతులను అందిస్తుందని వివరించారు. తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు. వార్డెన్ రాధారాణి, కిషోర్‌కుమార్, అరుణ్, శేఖర్, కృష్ణమూర్తి ఉన్నారు.

రాష్ట్ర కబడ్డీ అసోషియేషన్ ఉపాధ్యక్షుడికి సన్మానం

బాల్కొండ: రాష్ట్ర కబడ్డీ అసోషియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కబడ్డీ గంగాధర్‌ను సోమవారం ముప్కాల్‌లో గ్రామస్తులు సన్మానించారు. బద్దం నర్సారెడ్డి, సామవ వెంకట్‌రెడ్డి, గడ్డల గంగారాం, టీ సాయన్న, బాల్‌రాజ్, దినేష్, వినయ్ ఉన్నారు.

ఎల్ఆర్ఎస్ పై సర్వే

బాల్కొండ: ముప్కాల్ మండల పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఎల్ఆర్ఎస్‌పై పంచాయతీ కార్యదర్శులు సర్వేను నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల వద్ద స్నానాల గదులు నిర్మించాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని వివిధ గ్రామాల్లోగల ప్రముఖ ఆలయాల వద్ద స్నానాల గదులు, బాత్‌రూంలు నిర్మించాలని కోరుతూ బీజేపీ మండల నాయకులు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షులు పోతుగంటి సురేందర్, నాయకులు ఆరే గంగాధర్, శేఖర్, గంగారెడ్డి ఉన్నారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం..

బాల్కొండ: మెండోరాలో స్థానిక అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాకూరి వినోద్, గుంటి రవిల స్మారక వాలీబాల్ టోర్నమెంట్‌ను సోమవారం ఆరూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, మెండోరా ఎస్సై నారాయణ ప్రారంభించారు. వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, సావెల్ సహకార సంఘం చైర్మన్ రాజారెడ్డి పాల్గొన్నారు.

ఓంకార్‌కు ఘన నివాళి

బోధన్: పట్టణంలో సోమవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపకుడు అమరుడు మద్దికాయల ఓంకార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా ప్రతినిధులు మల్యాల అనిల్, శ్రీనివాస్‌లు, మోసిన్, తోట సంగీత, ఉషా, కుమార్, రాములు, రాజు, రవీందర్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

బోధన్: ఎమ్మెల్సీ అమేర్ అలీఖాన్ ఆదివారం రాత్రి పట్టణానికి విచ్చేయగా, ఆయనను తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్సీని వారు కోరారు.

ఆధ్యాత్మికం..

- శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్ట పై గల శివాలయంలో సోమవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందీశ్వర మహారాజ్ సమక్షంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు సుమన్, పీసీ గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, జిమ్మిరవి, బట్టు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి



బోధన్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్ డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ ఆఫీసు ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకొని ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు పుట్టి నడ్పి నాగన్న, పడాల శంకర్, షేక్ నసీర్, సిద్ధ పోశెట్టి, శంకర్, గంగారాం, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడికి కంప్యూటర్ వితరణ

కమ్మర్‌పల్లి: మండలంలోని చౌట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌కు సోమవారం 1996–97 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థి పుప్పాల నవీన్ కంప్యూటర్‌ను వితరణ చేశారు. ఎంఈవో ఆంధ్రయ్య ఉన్నారు.

అనుమతులు తీసుకోవాలి



ఎడపల్లి(బోధన్): దీపావళి పండుగ సందర్భంగా టపాకాయల దుకాణదారులు తప్పకుండా సంబంధిత డివిజనల్ పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలని ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన టపాకాయల దుకాణదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దుకాణదారులు తప్పకుండా నిబంధనలు పాటించాలని సూచించారు. ఏఎస్ఐ ఇలియాస్, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



మాక్లూర్: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్ని కల్లో బీజేపీ అభ్యర్థులు అత్యధిక సంఖ్యలో గెలుపొంది సత్తా చాటాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్నాయని ఇప్పటి నుంచి బీజేపీ అభ్యర్థులు వారి గ్రామ పంచాయతీలలో ప్రజలతో మమేకమై ఉండాలన్నారు. తహసీల్దార్ శేఖర్, ఆర్ఐ మమ్మద్ షఫీ, రాయసింగ్, సురేష్ నాయక్, గంగోని సంతోష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి


బాల్కొండలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు


బినోల గ్రామంలో..


సోయాను పరిశీలిస్తున్న నేతలు

బాల్కొండ: రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో స్థానిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన సహకార సఘం చైర్మన్ నాగులపల్లి సురాజ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: నవీపేట, బినోల సొసైటీల పరిధిలోని వివిధ గ్రామాలలో సొసైటీ చైర్మన్లు న్యాలకంటి అబ్బన్న, మగ్గారి హన్మాండ్లులు సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. నవీపేట, బినోల సొసైటీల సీఈవోలు మహేష్‌గౌడ్, మ్యాక రమేష్, డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సోయా కొనుగోలు కేంద్రం పరిశీలన

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలంలోని సోయా కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. వడ్లను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన పడొద్దని ఆయన అన్నారు. సొసైటీ చైర్మన్ భరత్‌రాజ్ రెడ్డి, అలాగే డొంకేశ్వర్, నందిపేట్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడిశరం భూమేశ్ రెడ్డి, మంద మహిపాల్, మారంపల్లి లిఫ్ట్ చైర్మన్ భోజారెడ్డి, దేగాం గంగారెడ్డి, గడ్డం చిన్నారెడ్డి, వంశీ ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి


బోధన్‌లో ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

బోధన్‌టౌన్(బోధన్): పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు ఫీజు రీయింబర్స్‌మెంట్స్ వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం వారు ఏబీవీపీ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. దీంతో ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి ధర్నా విరమించాలని వారిని కోరారు. కానీ వారు వినకపోవడంతో అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించారు. ఈక్రమంలో అక్కడ కొద్ది సేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం శశిధర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలన్నారు. అలాగే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు కూనాల్, ప్రవీణ్, సంజయ్, ఓంకార్, వెంకటేశ్, వెంకటరెడ్డి, రవితేజ, మనోజ్ ఉన్నారు.

సమైక్యతా స్ఫూర్తిని ప్రోత్సహించడమే లక్ష్యం

- ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి
- పట్టణంలో 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్: జాతీయ సమైక్యతా స్ఫూర్తిని ప్రోత్సహించడమే 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' లక్ష్యమని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' (ఈబీఎస్‌బీ) పై రెండు రోజుల ఫొటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నిజామాబాద్ ఫీల్డ్ ఆఫీస్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేశారు. ఈబీఎస్‌బీ కింద జత చేసిన హర్యానా, తెలంగాణ రాష్ట్రాలలోని వివిధ ఆసక్తికరమైన అంశాలు, కళా రూపాలు, వంటకాలు, పండుగలు, స్మారక చిహ్నాలు, పర్యాటక ప్రదేశాలు, క్రీడలు మొదలైన వాటిని తెలియజేసేలా ఈ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన, రంగోలి పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అంతకు ముందు కళాకారులు ప్రదర్శించిన ఒగ్గు కథ వీక్షకులను ఆకట్టుకుంది. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి ధర్మనాయక్, రవీంద్రారెడ్డి, వై వేణు ప్రసాద్, డాక్టర్ సునీత, విజయనాథరెడ్డి, నహీదా ఫిర్దోస్, ఎస్ అంబర్ సింగ్, రషీద్, తదితరులున్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	నరుదు బ్రతుకు నటన-12.45,6.50 పొట్టెన్(తెలుగు)-3.40,9.45
స్క్రీన్-2	వెనమ్ ది లాస్ట్ డ్యాన్స్ (తెలుగు-3డీ)-11.15,1.50,4.25, 7.00,9.35
స్క్రీన్-3	జనక అయితే గనక(తెలుగు)-1.00 లగ్గం(తెలుగు)-4.00,10.20 వేట్టయన్(తెలుగు)-6.50
స్క్రీన్-4	దేవర(పార్ట్-1)--11.35 6.25 విశ్వం(తెలుగు)-3.10 జనక అయితే గనక(తెలుగు)-10.00

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	లగ్గం(తెలుగు)-10.40.4.40 విశ్వం(తెలుగు)-1.30 7.30 వేట్టయన్(తెలుగు)-10.40
స్క్రీన్-2	వెనమ్-ది (తెలుగు-3డీ)-11.00. 1.45,7.35 వెనమ్-ది(ఇంగ్లీష్-3డీ)-4.35, 10.35
స్క్రీన్-3	వేట్టయన్ - 1.35 పొట్టెన్(తెలుగు)-4.40,10.40 దేవర-పార్ట్-1(తెలుగు)-7.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	వెనమ్ ది లాస్ట్ డ్యాన్స్ (3డీ తెలుగు)-11.25,2.00 వెనమ్ ది లాస్ట్ డ్యాన్స్ (3డీ ఇంగ్లీష్)-4.35,7.10,9.45
స్క్రీన్-2	నరుడి బ్రతుకు నటన (తెలుగు)-1.05 దేవర(పార్ట్-1)- తెలుగు=4.00 జనక అయితే గనక(తెలుగు)-7.35 విశ్వం (తెలుగు)-10.35
స్క్రీన్-3	జనక అయితే గనక (తెలుగు)- 1.20 7.30 పొట్టేల్(తెలుగు)-4.20 10.25
స్క్రీన్-4	ఎంత పనిచేస్తావ్ చంంటి -11.00 లగ్గం(తెలుగు)-1.55 7.50 సముద్రుడు(తెలుగు)-4.45 వేట్టయన్(తెలుగు)-10.40
లలితామహల్	దేవర పార్ట్-1(తెలుగు)
దేవి	పొట్టెన్ (తెలుగు)
నటరాజ్	విశ్వం (తెలుగు)
విజయ్	వెనమ్ (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	81,900	వెండి(కిలో)	1,03,000
22 క్యారెట్స్	75,572		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800